ఆదివారం నందినగర్‌లోని నివాసంలో బీఆర్ఎస్ అత్యున్నత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్. సమావేశానికి హాజరైన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ స్పీకర్ సిరికొండ, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి, సబిత, సత్యవతి, సునీతాలక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ, ఎంపీలు శ్రీనివాస్‌రెడ్డి, లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, గువ్వల, మెతుకు ఆనంద్ తదితరులు

పొద్దున సుద్దులు.. పగలు బూతులు!

- ఉదయం వ్యక్తిగత దూషణలకు బిగొద్దని నీతివ్యాఖ్యలు
- మధ్యాహ్నం కేసీఆర్‌పై రేవంత్ పరుష వ్యాఖ్యలు
- వయసుకూ గౌరవమివ్వకుండా తిట్లు
- ఇరిగేషన్‌పై ప్రశ్నిస్తే సీఎం ఇరిటేట్
- రేవంత్‌రెడ్డి మాటతీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- విషయం లేకే తిట్ల దండకమా? అంటూ సెటైర్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): పొద్దున సుద్దులు.. పగలు తిట్లు.. ఇదే సీఎం రేవంత్ తీరు అంటూ పలువురు మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన భాషపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీఎం లాంటి ఉన్నత పదవిలో ఉంటూ వ్యక్తిగతంగా దూషణలు చేయడం, అసభ్య పదజాలాన్ని వినియోగించడంపై ప్రజలు మండిపడుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాడిన భాషనే ఇప్పుడు సీఎం స్థాయిలో ఉండి కూడా వాడటం ఏంటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. బహిరంగ సభ అయినా, అధికారుల సమావేశమైనా, విలేకరుల సమావేశమైనా.. ఇలా సందర్భం ఏదైనా సరే సీఎం రేవంత్‌రెడ్డి తిట్ల దండకాన్ని మాత్రం మానడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదివారం కృష్ణా జలాల వివాదంపై విలేకరుల సమావేశాన్ని నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి.. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌పై పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌ను ప్రతిసారి ఏకవచనం (నువ్వు)తో సంబోధించారు. దీనిపై తెలంగాణ సమాజం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నది. ఉద్యమనేత, పదేండ్లపాటు రాష్ట్రానికి సీఎంగా పనిచేసిన వ్యక్తి, సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉన్న నేతపై నోటికొచ్చినట్టు మాట్లాడటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రేవంత్‌రెడ్డికి పెద్ద, చిన్నా అనే ఇంగితం లేదని, కనీసం కేసీఆర్ వయసుకు, చేసిన పదవికైనా గౌరవం ఇచ్చి ఉండాల్సిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయనకు ఇరిగేషన్‌పై అవగాహన లేకే ఇరిటేట్ అయ్యారని సోషల్‌మీడియాలో నెటిజన్లు చురకలంటించారు. విషయం లేకపోవడంతో దాన్ని కప్పిపుచ్చుకొనేందుకుగానూ తిట్ల దండకం అందుకున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసలు విషయాన్ని మర్చిపోయేలా ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని పలువురు విమర్శించారు

సుద్దులు చెప్పిన కొన్ని గంటల్లోనే!

ఆదివారం ఉదయం పద్మ అవార్డు గ్రహీతల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి.. రాజకీయ నాయకుల భాషపై సుద్దులు చెప్పారు. రాజకీయ నాయకులు వ్యక్తిగత దూషణలు చెయ్యొద్దని, భాష హుందాగా ఉండాలంటూ మాజీ ఉపరాష్ట్రపతి, పద్మ విభూషణ్ గ్రహీత వెంకయ్యనాయుడు చేసిన సూచనలు పాటిస్తామని చెప్పుకొచ్చారు. తీరా కొన్ని గంటలు కూడా గడవకముందే మళ్లీ పాత రేవంత్‌రెడ్డి బయటకొచ్చారు. మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో కేసీఆర్‌పై తిట్ల దండకం అందుకున్నారు. అసభ్య పదజాలంతో దూషించారు. సుద్దులు చెప్పడానికే కానీ తాను అచరణలో పాటించబోనని నిరూపించారు.

విభజన చట్టం ప్రకారమే..

- కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింత
- 16న సమావేశానికి హాజరవుతాం
- నీటివాటాలు తేలేవరకూ పెత్తనమివ్వబోం
- గత ప్రభుత్వహయాంలోనే అన్యాయం
- అసెంబ్లీలో చర్చిస్తాం.. అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తాం
- విలేకరుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రాజెక్టులను అప్పగించబోం: ఉత్తమ్

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): ఏపీ పునర్విభజన చట్టం 2014 ప్రకారమే కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్ (కేఆర్ఎంబీ)కి ప్రాజెక్టుల అప్పగింత కొనసాగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే ఈ ప్రతిపాదనలు, ప్రక్రియ కొనసాగిందని ఆరోపించారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింత అంశంపై సాగునీటిపారదులశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పర్యావరణ అటవీశాఖమంత్రి కొండా సురేఖతో కలిసి సచివాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించామంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీమంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ చేస్తున్నవన్నీ ఆరోపణలేనని పేర్కొన్నారు. ప్రజలను గందరగోళానికి గురిచేసి రాజకీయ లబ్ధి పొందడం, తమ పాపాలను కప్పిపుచ్చుకోవడం కోసమే ప్రభుత్వంపై కుట్రపూరితంగా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారమే ప్రాజెక్టుల అప్పగింత జరిగిందని స్పష్టం చేశారు. చట్టం చేసిన ప్పుడే కృష్ణా, గోదావరి జలాల పంపిణీని కేంద్రానికి అప్పగిస్తున్నట్టు కేసీఆర్ అంగీకరించారని తెలిపారు. అందులో భాగంగా పార్లమెంటులో కేసీఆర్, రాజ్యసభలో కే కేశవరావు ఓటేశారని, అది చట్టం కావడానికి మొదటి కారణం కేసీఆరేనని ఆరోపించారు.

వాటా అడగకుండా సంతకాలు పెట్టారు

కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీలను ఇరు రాష్ట్రాలకు ఎలా పంపిణీ చేయాలనే అంశంపై కేఆర్ఎంబీ 2015లో సమావేశం నిర్వహించిందని, అప్పుడు 50 శాతం వాటా అడగకుండా 299 టీఎంసీలు తెలంగాణకు, 512 టీఎంసీలు ఏపీకి కేటాయించేందుకు కేసీఆర్ సంతకాలు పెట్టారని రేవంత్ ఆరోపించారు. కృష్ణా నది 68% తెలంగాణలో ఉందని, 32% మాత్రమే ఏపీలో ఉందని, అంతర్జాతీయ నీటి విధివిధానాల ప్రకారం 500 పైగా టీఎంసీలు తెలంగాణకు, మిగతావి ఏపీకి దక్కాల్సి ఉన్నా సంతకాలు పెట్టి మరీ తెలంగాణకు రావాల్సిన నీటిని శాశ్వతంగా కేసీఆరే ఏపీకి ధారాదత్తం చేశారని మండిపడ్డారు. 15 ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగిస్తామని 2022, 2023లో నిర్వహించిన 16వ,17వ కేఆర్ఎంబీ బోర్డు సమావేశాల్లో కేసీఆర్ అంగీకరించారని, 2023-24 బడ్జెట్‌లో గోదావరి, కృష్ణా బోర్డులకు కలిపి రూ.400 కోట్లు కేటాయించారని తెలిపారు. 2004లో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో టీఆర్ఎస్ భాగస్వామని, పోతిరెడ్డిపాడు విస్తరణ నిర్ణయం జరిగినపుడు హరీశ్‌రావు, నాయిని నర్సింహారెడ్డి రాష్ట్రంలో, కేంద్రంలో కేసీఆర్ మంత్రులుగా ఉన్నారని తెలిపారు. పదవులకు ఆశపడి అనాడు పెదవులు మూసుకున్నారని, పోతిరెడ్డిపాడు ద్వారా నీళ్లు తరలించుకుపోతుంటే కొట్లాడింది తెలంగాణ కాంగ్రెస్ నేతలు పీజేఆర్, మర్రి శశిధర్‌రెడ్డి అని గుర్తుచేశారు. వాళ్లకు సహకరించకుండా వైఎస్‌కు కేసీఆర్ లొంగిపోయారని మండిపడ్డారు.

తండ్రి పోతిరెడ్డిపాడు.. కొడుకు రాయలసీమ

14 జనవరి 2020న జగన్ ప్రగతి భవన్‌లో కేసీఆర్‌ను కలిసి కృష్ణా జలాలపై 6 గంటలు సమీక్షించారని, అక్కడే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా రోజుకు 8టీఎంసీలు తరలించుకుపోయేందుకు కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని సీఎం ఆరోపించారు. తండ్రి పోతిరెడ్డిపాడుతో రోజుకు 4 టీఎంసీలు తరలించుకుపోతే, కొడుకు రాయలసీమ లిఫ్ట్‌తో రోజుకు 8 టీఎంసీలు తరలించుకుపోయారని, ఆ పనుల టెండర్‌కు ఆటంకం రాకుండా ఉండేందుకు సమావేశానికి కూడా వెళ్లకుండా వాయిదా వేయాలని కేంద్రానికి లేఖ రాయించారని విమర్శించారు. చంద్రబాబు హయాంలో 'ముచ్చుమర్రి'ని ప్రారంభించినది కూడా కేసీఆర్ హయాంలోనేనని ఆరోపించారు. ధనదాహంతోనే తెలంగాణ నీటిని తరలించుకుపోయేందుకు కేసీఆర్ సహకరించారని పేర్కొన్నారు. పదేండ్లలో ఎస్ఎల్బీసీ ప్రాజెక్టును పూర్తిచేయలేదని, ఉమ్మడి రాష్ట్రంలో జరిగినదానికంటే ఎక్కువగా ఈ పదేండ్లలోనే నిర్లక్ష్యం జరిగిందని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి పడావు పడిందని వివరించారు. రెండేళ్లలో పూర్తిచేస్తానన్న కేసీఆర్ పదేండ్లయినా పాలమూరు ప్రాజెక్టు పూర్తిచేయలేదని విమర్శించారు. ఇన్ని చేసి ఇప్పుడేమో ఉద్యమాలు చేస్తామంటున్నారని దుయ్యబట్టారు. తెలంగాణకు రావాల్సిన నీటివాటాలు, హక్కుల కోసం తాము కొట్లాడుతుంటే, అధికారం కోల్పోయి దిక్కుతోచక ఏదో ఒక వంకతో కాంగ్రెస్‌ను బద్నాం చేయాలని బీఆర్ఎస్ చూస్తున్నదని ఆరోపించారు. తెలంగాణకు న్యాయమైన నీటి కేటాయింపులు తేలిన తర్వాతే ప్రాజెక్టులు అప్పగిస్తామని, ఏపీ, తెలంగాణ ప్రాజెక్టులే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాజెక్టులను కూడా బోర్డు పరిధిలోకి తీసుకోవాలని కేంద్రజలశక్తిశాఖను కోరామని వెల్లడించారు. తెలంగాణ హక్కుల కోసం అన్ని వేదికలపైనా పోరాడతామని చెప్పారు. ఏపీ, తెలంగాణ మధ్య కాకుండా బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య నీటివాటాలను పునఃపంపిణీ చేయాలని కేంద్రాన్ని కోరుతున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈనెల 16న నిర్వహించబోయే సమావేశానికి హాజరవుతామని, తెలంగాణ హక్కులను కాపాడుతామని వెల్లడించారు.

ప్రాజెక్టుల పూర్తికి నిధుల విడుదల

అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాలపై ప్రభుత్వం ఒక ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నదని, పెండింగ్ ప్రాజెక్టులను మూడు విభాగాలుగా చేసి పూర్తిచేస్తామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. నిధులు కూడా ప్రత్యేకంగా విడుదల చేస్తామని వెల్లడించారు. 42 కిలోమీటర్ల ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణం రాష్ట్ర విభజన నాటికే 30 కిలోమీటర్లు పూర్తయిందని, గడచిన పదేండ్లలో ఒక కిలోమీటర్ మాత్రమే నిర్మించారని, పూర్తి చేసి ఉంటే దాని కింద లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరు-రంగారెడ్డి-కల్వకుర్తి ఎత్తిపోతల పనులు నిర్లక్ష్యానికి గురయ్యాయని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నిపుణులతో విచారణ జరిపించి నివేదికలు తెప్పిస్తామని, జ్యుడీషియల్ విచారణకు ఇప్పటికే హైకోర్టు న్యాయమూర్తికి లేఖ రాసినట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర నీటి హక్కులను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు.

ప్రాజెక్టులను అప్పగించేది లేదు: మంత్రి ఉత్తమ్

రాష్ట్ర సాగునీటిపారదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించేది లేదని తేల్చిచెప్పారు. నీటిపారుదలశాఖను కేసీఆర్ సర్వనాశనం చేశారని ఆరోపించారు. కాళేశ్వరంపై 95 వేల కోట్లు, పాలమూరు ప్రాజెక్టుపై 27,500 కోట్లు, సీతారామ ప్రాజెక్టుపై 7,500కోట్లు ఖర్చుపెట్టి ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వలేదని దుయ్యబట్టారు.

అసెంబ్లీలో చర్చిద్దాం

కేంద్రజల్‌శక్తిశాఖ నిర్వహించిన సమావేశంలో తెలంగాణ వాదనలు సరిగా రికార్డు రాలేదని, తమ వాదనలను స్పష్టంగా రికార్డు చేయాలని ఇప్పటికే కోరామని రేవంత్‌రెడ్డి తెలిపారు. నాగార్జునసాగర్‌ను ఏపీ ఆక్రమించుకుంటున్నా కేసీఆర్ చూస్తుండిపోయారని, పల్లెత్తు మాట మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రాజెక్టు జలాలపై, ప్రాజెక్టుల శ్వేతపత్రంపై రెండు రోజులు చర్చిద్దామని, అవి చాలవంటే సమావేశాలను పొడిగిస్తామని, అవసరమైతే ఉభయసభలు నిర్వహిస్తామని తెలిపారు. నిజాయతీ, చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత అసెంబ్లీకి రావాలని సవాలు విసిరారు. కేసీఆర్‌కు పూర్తి అవకాశమిస్తామని, ఒక్క నిమిషం కూడా మైక్ కట్ చేయబోనని తెలిపారు.

కృష్ణా జలాలపై హక్కులను కాపాడుకుందాం

మొదటిపేజీ తరువాయి...

ఉన్న పార్టీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయం వల్ల తెలంగాణ జలహక్కులకు వాటిల్లబోయే ప్రమాదాన్ని రైతాంగానికి, ప్రజలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్‌పై చేస్తున్న ఆరోపణలకు దీటుగా జవాబివ్వాలని, జలహక్కుల సాధనకు బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో చేసిన కృషిని వివరిద్దామని సూచించారు. ప్రాజెక్టుల నిర్మాణానికి వాటిల్లబోయే ఆటంకాలను కూడా ప్రస్తావించాలని నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా సోమవారం బీఆర్ఎస్ సీనియర్ నేతలు పత్రిక సమావేశాన్ని నిర్వహించే అవకాశమున్నది. సమావేశంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రు లు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, సునీతాలక్ష్మారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు ముఖ్యకార్యకర్తల సమావేశం

ప్రాజెక్టుల అప్పగింత అంశం నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఎన్నికల అనంతరం తొలిసారిగా కేసీఆర్ తెలంగాణభవన్‌లో అడుగుపెట్టబోతున్నారు. కృష్ణా బేసిన్ పరిధిలోని ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం, హైదరాబాద్ ఐదుజిల్లాల ముఖ్యకార్యకర్తలతో భేటీ కానున్నారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సమావేశం కొనసాగే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. ప్రభుత్వ నిర్ణయంపై రైతులు, కార్యకర్తలను కదిలించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నారు. పార్టీ ముఖ్యకార్యకర్తలకు స్వయంగా కేసీఆరే దిశానిర్దేశం చేయనున్నారు. అందులో భాగంగా నల్లగొండలో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు సమాలోచనలు చేస్తున్నారు. ఫిబ్రవరి రెండో వారంలో సభ నిర్వహించాలని యోచిస్తున్నారు.

పాలేరు నీళ్ల కోసం పోరుబాట

మొదటిపేజీ తరువాయి...

కష్టాలను ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో ఆయకట్టు రైతులు రిజర్వాయర్ కట్టపైకి వచ్చి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ పాత కాలువ నుంచి దిగువకు అనధికారికంగా జలాలను వదిలారు. విషయం తెలుసుకున్న నీటిపారుదల, రెవెన్యూ శాఖ అధికారులు, కూసుమంచి పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి రైతులను అడ్డుకోగా స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఆర్డీవో నగేశ్, ఏసీపీ బస్వారెడ్డి, నీటిపారుదల శాఖ ఈఈలు అనన్య, మంగలపూడి వెంకటేశ్వర్లు, డీఈలు మధుమన్మథరావు, రత్నకుమారి, సీఐ జితేందర్, ఎస్సైలు రమేశ్‌కుమార్, సతీశ్, శ్రీను రైతులతో సుదీర్ఘ చర్చలు జరిపారు. అనంతరం అధికారులు, రైతులు సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరి దయాకర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన విరమించడంతో అధికారులు కాలువ గేట్లను మూసివేశారు.

'నమస్తే' ప్రశ్నలకు సీఎం ఉక్కిరిబిక్కిరి

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): పత్రికా సమావేశంలో భాగంగా పలువురు పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు సీఎం రేవంత్‌రెడ్డి బదులిచ్చారు. ఈ సందర్భంగా 'నమస్తే తెలంగాణ' అడిగిన పలు ప్రశ్నలకు సీఎం దాటవేత ధోరణి ప్రదర్శించారు. ఇరు రాష్ట్రాల మధ్య నీటివాటాలకు సంబంధించి ట్రిబ్యునల్-1 ప్రకారం అనాటికి ఉన్న నీటి వినియోగాలను పరిగణలోకి తీసుకుని ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలని తేల్చి, నాటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వమే ప్రతిపాదించి పునర్విభజన చట్టంలో చేర్చారని 'నమస్తే' గుర్తుచేసింది. ఆ మేరకు 2015లో నిర్వహించిన సమావేశంలో ఇరు రాష్ట్రాలకు నీటి పంపకాలు జరిగాయని, అదికూడా ఏడాది కాలపరిమితితో తాత్కలిక ఒప్పందం మాత్రమేనని, అలాంటి సందర్భంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే ఒప్పుకుందని ఎలా అంటారని సీఎంను ప్రశ్నించింది. ఈ ప్రశ్నలకు రేవంత్‌రెడ్డి సూటిగా సమాధానం ఇవ్వకుండా జవాబులు దాటవేశారు. పునర్విభజన చట్టం ప్రకారం ప్రాజెక్టులను అప్పగించాల్సి ఉందని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేశారు. అంతేకాదు, 'గత సమావేశం మినిట్స్‌లో అది ఎక్కడ ఉంది?' అని ప్రశ్న అడిగిన పాత్రికేయుడిని దబాయించారు. 'నీ పేరేంటి? ఏ పత్రిక' అని ప్రశ్నించారు. 'నమస్తే తెలంగాణ' అని చెప్పగానే 'అదీ సంగతి. అదొక్కటి చాలు ఏం సమాధానం చెప్పాలనేది. మేనేజ్‌మెంట్‌ను బట్టి వాదన ఉంటుంది' అని ప్రశ్నకు సమాధానం చెప్పకుండా దాటవేశారు.

కౌంటర్-ఎన్‌కౌంటర్

రాష్ట్ర పునర్విభజన చట్టం చేసినప్పుడే కృష్ణా, గోదావరి జలాల పంపిణీని కేంద్రానికి అప్పగిస్తున్నట్టు కేసీఆర్ ఒప్పుకున్నారు. ఆ చట్టం కావడానికి మొట్టమొదటి కారణం కేసీఆరే.: సీఎం రేవంత్

రాష్ట్ర పునర్విభజన చట్టం చేసినప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్సే. నీళ్లపై తెలంగాణకు 50 శాతం వాటా ఇవ్వాలి.. శ్రీశైలం ప్రాజెక్టును హైడల్ ప్రాజెక్టుగా గుర్తించాలి అని కేసీఆర్ సర్కారు అనేక షరతులు పెడితే కేంద్రం ఒప్పుకోలేదు. అందుకే ప్రాజెక్టులు అప్పజెప్పకుండా తొమ్మిదిన్న రేండ్లుగా దాటవేస్తూ వచ్చింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు నెలలు కూడా కాక ముందే ప్రాజెక్టులన్నీ కేంద్రానికి అప్పజెప్పిం ది. నాడు కేంద్రంలోని కాంగ్రెస్ తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తే.. నేడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండు నెలల్లోనే ప్రాజెక్టులను అప్పగించి తీరని ద్రోహం చేసింది.

నాగార్జునసాగర్‌ను ఆంధ్రప్రదేశ్ ఆక్రమించుకుంటున్నా మాజీ సీఎం కేసీఆర్ చూస్తుండి పోయారు. పల్లెత్తు మాట్లాడలేదు? : సీఎం రేవంత్

అది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలరోజు జరిగింది. అప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నది. కేసీఆర్ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్నందున ఎలాంటి నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉండదు. ఇలాంటి నిర్ణయాలన్నీ సీఎస్, ఎలక్షన్ కమిషన్ చేతుల్లో ఉంటాయి. కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాక నెలరోజులకే కేఆర్ఎంబీ సమావేశమైతే దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ కనీసం అభ్యంతరం తెలుపలేదు. విభజన చట్టం ప్రకారం ప్రాజెక్టుల అప్పగింత కొనసాగుతుందని మీడియా ముఖంగా ప్రకటించారు. ప్రాజెక్టును ఏపీ పోలీసులు ఎందుకు ఆధీనంలోకి తీసుకున్నారని కనీసం ప్రశ్నించలేదు.

ఉమ్మడి ఏపీలో తెలంగాణకు అన్యాయమే జరగలేదట!

- సాగునీళ్లలో అప్పుడే అద్భుతంగా ఉండేదట
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ వింతవాదన
- మంత్రి వ్యాఖ్యలపై తెలంగాణవాదుల ఆగ్రహం
- తెలంగాణ ఉద్యమం ఎందుకొచ్చిందని నిలదీత
- అన్నదాతలతో రాజకీయం చేయొద్దని హితవు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి ఏపీలో తెలంగాణకు ఎలాంటి అన్యాయం జరుగలేదట.. సాగునీళ్ల విషయంలో అప్పుడు బాగుండేదట. ఇవీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వింత వాదనలు. ఆదివారం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కృష్ణా జలాలకు సంబంధించి ఉమ్మడి ఏపీలో తెలంగాణకు అన్యాయమే జరుగలేదని వ్యాఖ్యానించారు. దీనిపై తెలంగాణవాదులు మండిపడుతున్నారు. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్‌పార్టీ నేతలు తెలంగాణ నేపథ్యం, ఉద్యమం, నాటి వివక్ష అన్నీ మర్చిపోయారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరి ఉమ్మడి ఏపీలో తెలంగాణకు అన్యాయం జరుగకపోతే 60 ఏండ్ల సుదీర్ఘ తెలంగాణ ఉద్యమం ఎందుకు చేయాల్సి వచ్చిందో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. కృష్ణా జలాల్లో అప్పుడే తెలంగాణకు సముచిత స్థానం దక్కితే తెలంగాణ ప్రాంతం కరువుతో ఎందుకు అల్లాడిందని, వ్యవసాయం దుర్భిక్షం ఎందుకయ్యిందో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఎకరాకు కూడా సాగునీళ్లు ఇవ్వలేదని మంత్రి ఆరోపించారు. దీనిపైనా రైతులు మండిపడుతున్నారు. సాగునీటికి సంబంధించి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో ఆ ఫలితాలను అనుభవిస్తున్న తమకు తెలుసని అంటున్నారు. నాడు పడావుపడ్డ భూముల్లో ఇప్పుడు పంటలు పండించుకొని బతుకుతున్నామని చెప్తున్నారు. రైతులు, వ్యవసాయంతో రాజకీయం చేయొద్దని మంత్రి ఉత్తమ్‌కు తెలంగాణవాదులు హితవు పలికారు. చేతనైతే రైతులకు మంచి చేసేందుకు ప్రయత్నించాలని, అంతేగానీ ఉన్న మంచిని చెడగొట్టి రైతులను ఇబ్బందులకు గురిచెయ్యొద్దని సూచించారు.

అప్పగింతపై ఒప్పుకోలు

మొదటిపేజీ తరువాయి...

డాక్యుమెంట్లను పరిశీలిస్తేనే స్పష్టమవుతున్నది.ఏపీ పునర్విభజనకు ముందు తెలంగాణ, ఏపీకి మధ్య ఎలాంటి నీటి ఒప్పందాలు లేవు. ట్రిబ్యునల్ కేటాయింపులు కూడా ప్రత్యేకంగా వేర్వేరుగా లేవు. ఉమ్మడి ఏపీని పరిగణనలోకి తీసుకొని ఇచ్చినవి మాత్రమే. దీంతో అప్పటికే ప్రాజెక్టులవారీగా నీటి లెక్కలను తీయగా ఏపీ 512 టీఎంసీలు (66 శాతం), తెలంగాణ 299 టీఎంసీలను (34 శాతం) వినియోగించుకొంటున్నది. ఆ లెక్కలనే పునర్విభజన చట్టంలో అనాటి యూపీఏ ప్రభుత్వం పొందుపరిచింది. ఆ ముసాయిదా బిల్లుపై తెలంగాణ అసెంబ్లీలో 2013లో చర్చ కూడా జరిగింది. ఆ తర్వాత పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం ఆ జలాలను ప్రాజెక్టులవారీగా మాత్రమే కేటాయించాలని ట్రిబ్యునల్ 2కు కేంద్రం అప్పటికే మార్గదర్శకాలు జారీ చేయగా, వాదనలు కొనసాగుతున్నాయి. అయితే, అప్పటివరకు కృష్ణాజలాల వినియోగం కోసం ఇరు రాష్ట్రాలతో కేఆర్ఎంబీ 2015లో సమావేశాన్ని నిర్వహించింది. అప్పటికే వినియోగించుకుంటున్న 66:34 నిష్పత్తిలోనే కృష్ణా జలాలను ఇరు రాష్ట్రాలు తీసుకోవాలని బోర్డు ప్రతిపాదించింది. అందుకు తెలంగాణ పలు షరతులను విధిస్తూ ఒప్పందం చేసుకొన్నది. ఆ ఒప్పందం కేవలం 2015-16 వాటర్ ఇయర్ కోసం మాత్రమేనని తెలియజేసింది. ఈ ఒప్పందమనేది ఏ వేదికపైనా కూడా చెల్లబోవని స్పష్టంగా నొక్కిచెప్పింది. వీటిని సీఎం రేవంత్ దాచిపెట్టి గత ప్రభుత్వమే 299 టీఎంసీలకు ఒప్పుకొన్నదని చెప్పడం గమనార్హం. ఈ ఒప్పందానికి ముందుగానే నాటి ప్రభుత్వం పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం కాకుండా, అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం 1956, సెక్షన్ 3 కింద కృష్ణా జలాల పున:పంపిణీ చేపట్టాలని, ట్రిబ్యునల్ వేయాలని కోరింది. అయినప్పటికీ రేవంత్‌రెడ్డి ఆ విషయాలను ప్రస్తావించకుండా కేవలం 299 టీఎంసీలకే ఒప్పుకొన్నదని చెప్పి బీఆర్ఎస్‌పై బురదజల్లేందుకు యత్నించారు. ట్రిబ్యునల్ తీర్పు వచ్చేదాకా పాత నిష్పత్తినే కొనసాగించడానికి బీఆర్ఎస్ ఒప్పుకొన్నదని ఆరోపించిన రేవంత్.. ఎలాంటి డాక్యుమెంట్ చూపకపోవడం కొసమెరుపు. వాస్తవంగా అలాంటి ఒప్పందమేమీ లేకపోవడం గమనార్హం.

2016లో రెండో అపెక్స్ కౌన్సిల్ మినిట్స్

2016 నాటికి కూడా కృష్ణా బేసిన్ ప్రాజెక్టులు పూర్తి కాకపోవడంతో 2015 ఒప్పందాన్ని మరొక ఏడాదికి పొడిగించడానికి మొదటి అపెక్స్ మీటింగ్ నిర్ణ